సాక్షి నల్లగొండ

గురువారం : 28 : మార్చి : 2024



శిక్షణతో ఉపాధి అవకాశాలు
వ్యవసాయ అనుబంధ రంగాల్లో శిక్షణ ద్వారా యువతకు ఉపాధి కల్పించవచ్చని డీపీఓ శ్రీధర్‌రెడ్డి అన్నారు. - 8లో



ఏసీబీ వలలో సెక్రటరీ
పొడిచేడు పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. - 8లో



న్యూస్‌రీల్

నేడు నల్లగొండ బార్ అసోసియేషన్ ఎన్నికలు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇప్పటికే వైస్ ప్రెసిడెంట్ 1, స్పోర్ట్స్ సెక్రటరీ, కల్చరల్ సెక్రటరీ పదవులు ఏకగ్రీవమైనట్లు తెలిసింది. అధ్యక్ష స్థానం కోసం గోసుల మోహన్, సిరిగిరి వెంకట్‌రెడ్డి ప్యానల్ మధ్య పోటీ ఉంది. మధ్యాహ్నం తర్వాత ఓట్లు లెక్కించి.. సాయంత్ర ఫలితాలను ప్రకటించనున్నారు.

అగ్రికల్చర్ మినిస్టీరియల్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక


వి. వెంకటరమణ


టి. శ్రీనివాస్

నల్లగొండ టౌన్ : తెలంగాణ అగ్రికల్చర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వి.వెంకటరమణ, కార్యదర్శిగా టి.శ్రీనివాస్, సహాధ్యక్షుడిగా వెంకటరమణ, కోశాధికారిగా డి.రామ్మోహన్‌రాజుతోపాటు 16 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కె.దశరథ వ్యవహరించారు. కార్యక్రమంలో నాగిల్ల మురళి, జె.శేఖర్‌రెడ్డి, నర్సింహాచారి, టి.వెంకట్‌రెడ్డి, అనంతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


విలేకరులతో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

రామన్నపేట : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. బుధవారం రామన్నపేట సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత యాసంగి సీజన్ నుంచే వరికి రూ.500 బోనస్ ఇవ్వాలని, రైతు రుణాలు మాఫీ చేయాలని, ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలని కోరారు. బీజేపీ దేశాన్ని అన్ని రంగాల్లో భ్రష్టు పట్టించిందని, ఈడీ, సీబీఐ సంస్థలను అడ్డం పెట్టుకొని ప్రాంతీయ పార్టీలను ప్రలోభ పెడుతుందని ఆరోపించారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీజేపీయేనన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని, సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు. ఆయనవెంట సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్, రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజు, బొడ్డుపల్లి వెంకటేశం, బోయిని ఆనంద్, మీర్ ఖాజాఅలీ, బల్గూరి అంజయ్య ఉన్నారు.

జీవ నియంత్రణ పద్ధతులు అవలంబించాలి


రైతులకు జీవనియంత్రణ ఉపకరణాల కిట్‌ను అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

భూదాన్‌పోచంపల్లి : రైతులు రసాయన ఎరువులకు బదులు జీవ నియంత్రణ పద్ధతులు అవలంబించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త రామకృష్ణబాబు సూచించారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి మండలం పెద్ద రావులపల్లి రైతువేదికలో ఇంద్రియాల, గౌస్‌కొండ, రామలింగంపల్లి గ్రామాల గిరిజన రైతులకు గిరిజన ఉపప్రణాళిక కింద వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కాండం తొలుచు పురుగు, అగ్గితెగులు నివారణకు రైతులు పురుగు మందులు పిచికారీ చేస్తూ అధికంగా డబ్బులు వెచ్చిస్తున్నారని, దీంతో పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. జీవనియంత్రణ పద్ధతుల ద్వారా ఎటువంటి నష్టం ఉండదన్నారు. అనంతరం రైతులకు లింగాకర్షక బుట్టలు, వేపనూనె, సుడోమెనాస్ ఫ్లోరోసిన్స్ ఉపకరణాల కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్‌కుమార్, భువనగిరి ఏడీఏ భూక్యా దేవ్‌సింగ్, ఏఓ ఏజాజ్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోనే మంట!

39 డిగ్రీలకు చేరిన గరిష్ట ఉష్ణోగ్రత


మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా ఉన్న క్లాక్‌టవర్ సెంటర్

- 20 శాతానికి పడిపోయిన గాలిలో తేమ
- వర్షాభావంతో తగ్గిన భూగర్భ జలాలు
- ఎండ వేడిమికి అల్లాడుతున్న జనం
- ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని జంకుతున్న జనం

నల్లగొండ : ఎండలు మండుతున్నాయి. మార్చిలోనే మే నెలను తలపించేలా ఎండలు ఉన్నాయి. ఉదయం పది గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతుండడంతో అల్లాడుతున్నారు. మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గతేడాది మార్చితో పోల్చితే ఈ సారి ఎండ తీవ్ర ఎక్కువగా ఉంది. దీంతో గాలిలో తేమ కూడా 20 శాతానికి పడిపోయింది. ఎండలకు తోడు భూగర్భ జలాలు కూడా అడుగంటడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం భయపడుతున్నారు.

2023, 2024 మార్చి నెలలో ఉష్ణోగ్రతలు, గాలిలో తేమశాతం ఇలా..

	(2024)		(2023)	
తేదీ	గరిష్ట ఉష్ణోగ్రత	గాలిలో తేమ	గరిష్ట ఉష్ణోగ్రత	గాలిలో తేమ
15	37.0	24	34.5	41
16	38.4	23	33.5	50
17	38.5	24	28.5	62
18	38.0	26	28.0	73
19	35.5	29	29.0	55
20	36.0	27	31.5	52
21	37.5	26	33.0	41
22	38.0	24	34.0	42
23	38.5	23	33.0	53
24	37.5	28	34.0	41
25	38.0	23	34.5	36
26	38.5	21	35.0	38
27	39.0	20	36.0	37

ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు..
ఈ ఏడాది మార్చిలోనే ఉష్ణోగ్రతలు భారీ పెరిగాయి. 2023 మార్చి 1వ తేదీన జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 36.2 డిగ్రీలు నమోదు కాగా.. అదే నెల 27వ తేదీన 36 డిగ్రీలుగా ఉంది. కానీ 2024 మార్చి 1న 35.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా.. 27వ తేదీన 39.0 డిగ్రీలకు పెరిగింది. ఇలా మార్చిలోనే ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలకు చేరుకుందంటే ఏప్రిల్, మే నెలల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్ దాటుతాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



గాలిలో తగ్గిన తేమ....
ఈ ఏడాది గాలిలో తేమ కూడా 20 శాతానికి పడిపోయింది. ఉష్ణ తాపాన్ని తట్టుకోలేక జనం ఏసీలు, కూలర్లను వినియోగిస్తున్నారు. ఏసీల వాడకంతో గాలిలో తేమ పూర్తిగా తగ్గిపోతోంది. 2023 మార్చి 1వ తేదీన గాలిలో తేమ 41 శాతం ఉండగా అదే సంవత్సరం మార్చి 27వ తేదీన 37 శాతానికి పడిపోయింది. 2024 మార్చి 1న గాలిలో తేమ 30 శాతం ఉండగా, 27వ తేదీన 20 శాతానికి పడిపోయింది.


గుర్రంపోడులో సన్నగా పోస్తున్న బోరు

భారీగా పడిపోయిన భూగర్భ జలాలు..
ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు భారీగా పడిపోయాయి. గత సంవత్సరం ఫిబ్రవరిలో చందంపేట మండలంలో భూగర్భ జలాలు 8.95 మీటర్ల పైన ఉంటే.. ఈ సారి 16.67 మీటర్ల లోతుకు పడిపోయాయి. నేరడుగొమ్ము మండలంలో గతేడాది 10.10 మీటర్లపైన ఉన్న నీరు ఇప్పుడు 14.88 మీటర్లకు పడిపోయింది. అనుముల మండలంలో 5.27 మీటర్ల నుంచి 10.48 మీటర్లకు, పెద్దవూరలో 3.73 మీటర్ల నుంచి 12.08 మీటర్లకు, చండూరులో 5.99 మీటర్ల నుంచి 12.40 మీటర్లకు, చిట్యాలలో 6.08 మీటర్ల నుంచి 16.42 మీటర్లకు పడిపోయాయి. ఎండలు మండుతుండడంతో ఆ ప్రభావం పంటలపై పడుతోంది. ఇప్పటికే బోర్లు వట్టిపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. పంటలను దక్కించుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. కొందరు అద్దె బోర్లను తీసుకుంటున్నారు. నీరు లేని చోట పొలాల్లో పశువులను మేపుతున్నారు.

భువనగిరి చామలకే..

కాంగ్రెస్ ఎంపీ టికెట్ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఖరారు చేసిన సీఈసీ

- ఎట్టకేలకు సస్పెన్స్‌కు తెర
- తేలిన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- హోరెత్తనున్న ఎన్నికల ప్రచారం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేరును ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) ఖరారు చేసింది. బుధవారం ఢిల్లీలో జరిగిన సీఈసీ సమావేశంలో కిరణ్‌కుమార్ రెడ్డి అభ్యర్థిత్వానికి ఓకే చెప్పింది. మొదటి జాబితాలోనే నల్లగొండ ఎంపీ అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం.. భువనగిరి అభ్యర్థి విషయాన్ని తేల్చలేదు. దీంతో టికెట్ ఎవరికి దక్కనుందోనని ఆశావహులతో పాటు పార్టీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎట్టకేలకు అభ్యర్థిని ప్రకటించి సస్పెన్స్‌కు తెరదించింది.

మొదటి నుంచి టికెట్‌పై ఆశలు
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా, టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడాదిన్నర కాలంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి.. మొదటి నుంచి తనకు భువనగిరి టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. టికెట్ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. అయితే ఎవరిని బరిలో నిలుపాలన్న విషయంలో అధిష్టానం మొదటి విడతలో ఓ నిర్ణయానికి రాలేకపోయింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్న కుమారుడు కోమటిరెడ్డి సూర్య పవన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలువడంతో ఆయన్ని ఎంపీగా బరిలో నిలుపుతారన్న చర్చ సాగింది. మధ్యలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని బీఆర్ఎస్ తరఫున నిలబెట్టాలని ఆ పార్టీ భావించగా అందుకు ఆయన నిరాకరించారు. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరుతారని, ఆయనకే ఎంపీ టికెట్ ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఆయన కాంగ్రెస్‌లో చేరకపోవడంతో ఆ ప్రచారం ఉత్తిదేనని తేలిపోయింది. మరోవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మిని బరిలో నిలుపాలంటూ అధిష్టానం రాజగోపాల్‌రెడ్డిపై ఒత్తిడి పెంచుతోందన్న చర్చ నడిచింది. ఇదే తరుణంలో తాము ఎంపీ టికెట్ అడగడం లేదని, తాము టికెట్ అడుగుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం పోటీ చేయాలని మరింత ఒత్తిడి చేస్తే ఆలోచిస్తామని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో భువనగిరి టికెట్ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి లేదంటే కోమటిరెడ్డి లక్ష్మికే ఇస్తారని చర్చ సాగింది.

తెరపైకి బీసీ అంశం
బీఆర్ఎస్, బీజేపీ బీసీ అభ్యర్థులను పోటీలో నిలిపిన నేపథ్యంలో కాంగ్రెస్ కూడా అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని పోటీలో ఉంచాలని, భారీ మెజారిటీతో గెలిపించి తీసుకువస్తామని తాను రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి తెలియజేసినట్లు ఇటీవల కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మీడియా సమావేశంలో చెప్పారు. దీంతో బీసీ అంశం తెరపైకి వచ్చింది. అయితే ఉత్కంఠకు తెరదించుతూ కాంగ్రెస్ అధిష్టానం కిరణ్‌కుమార్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ఇదిలా ఉండగా బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ కూడా అభ్యర్థిని ఖరారు చేయడంతో ఇక ప్రచారం హోరెత్తనుంది.



పేరు : చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
పుట్టిన తేదీ : 24 అక్టోబరు, 1974
తండ్రి : చామల వాసుదేవరెడ్డి
స్వగ్రామం : తుంగతుర్తి నియోజకవర్గం, శాలిగౌరారం
విద్యాభ్యాసం: హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా
2008 -2009 : జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి (మహారాష్ట్ర, గోవా, డెహ్రాడూన్, హవేలీ ఇన్‌చార్జి)
2005 -2006 వరకు : ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ
2007 - 2008 వరకు : రాహుల్‌గాంధీ టీం అయిన డిస్కవరీ ఇండియా టాస్క్‌ఫోర్స్ మెంబర్, ఆమ్ ఆద్మీకా సిపాహి నేషనల్ కోఆర్డినేటర్
2009 -2011 వరకు : జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (తమిళనాడు, కేరళ, లక్షద్వీప్, అండమాన్ నికోబార్, పాండిచ్చేరి ఇన్‌చార్జి)
2017 - 2021 : టీపీసీసీ అధికార ప్రతినిధి
2021 నుంచి : టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నేటి నుంచి ధాన్యం కొనుగోలు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే యాసంగి వరి కోతలు ప్రారంభమై వారం గడుస్తోంది. ప్రభుత్వం గురువారం నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోంది. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులతో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యంలో తేమ, తాలు శాతం విషయంలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొనుగోళ్లలో ఏవైనా సమస్యలు వస్తే తహసీల్దార్, ఆర్డీఓలకు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కేంద్రాలను ప్రజాప్రతినిధులు ఎవరూ ప్రారంభించకూడదని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీసీఓ కరుణాకర్, డీఏఓ శ్రావణ్, తూనికల కొలతల అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

లైసెన్స్ గన్‌లను అప్పగించాలి : ఎస్పీ

నల్లగొండ క్రైం : పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో లైసెన్స్ గన్ కలిగిన వారు వాటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లలో గానీ, ఎస్పీ కార్యాలయంలో గానీ అప్పగించాలని ఎస్పీ చందనాదీప్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 136 మంది లైసెన్స్ గన్‌లు కలిగి ఉన్నారని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకుగాను గన్‌లను అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గన్‌లను అప్పగించని వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది, గార్డు విధుల్లో ఉన్న వారికి మినహాయింపు ఉంటుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగొద్దు


- విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్


సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ చంద్రమోహన్

కొండమల్లేపల్లి : వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గృహ, వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ అందించాలని, విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే తక్షణమే పరిష్కరించాలని సూచించారు. పట్టణంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా 100 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కోసం సొంత వాహనాల్లో తీసుకొస్తే దానికి సంబంధించిన ఖర్చులను విద్యుత్ శాఖ భరిస్తుందని, ఇందుకు సదరు రైతు తన ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. అంతకుముందు కొండమల్లేపల్లిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. సమావేశంలో కొండమల్లేపల్లి డీఈ విద్యాసాగర్, దేవరకొండ, నాంపల్లి ఏడీలు సైదులు, సాగర్‌రెడ్డి, ఏఈలు దేవోజీనాయక్, కావ్య, జమీరుద్దీన్, వినోద్, సాయిప్రకాశ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

నాటక సాహిత్యంపై పరిశోధన చేయాలి

- డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి


మాట్లాడుతున్న డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి

రామగిరి(నల్లగొండ) : తెలుగు నాటక సాహిత్యంపై విస్తృతమైన పరిశోధనలు చేయాలని సాహిత్య పరిశోధకుడు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నాగార్జున ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో ×తెలుగు నాటకం- సాహిత్య సమాలోచన¥ అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు నాటక సాహిత్యంపై ఆసక్తిని పెంపొందింపజేయడమే కాకుండా విద్యార్థులను పరిశోధకులుగా సాహిత్య అభిమానులుగా తీర్చిదిద్దుతాయని తెలిపారు. జాతీయ ఉత్తమ సినీ విమర్శక పురస్కార గ్రహీత డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్యులు నాటక రచయితతో పాటు నటులు, నాటక ప్రయోక్త అందరూ తమ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఆ నాటకం జనరంజకం అవుతుందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ నాటక రంగం మనోరంజకమైనదని ఇవాళ సినిమా ప్రభావం వల్ల నాటక రంగ సంస్థలు కనుమరుగవుతున్నాయని.. అలాంటి సంస్థల్ని, నటుల్ని ఆదరించాల్సిన అవసరం నేటి ప్రభుత్వం పైన ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, తెలంగాణ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య కరిమిళ్ల లావణ్య, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, ఎస్.లవేందర్‌రెడ్డి, డాక్టర్ వెల్దండి శ్రీధర్, జి.గోవర్ధనగిరి, డాక్టర్ టి.సైదులు, ఎస్.ప్రభాకర్, ఎం.లింగస్వామి, బి.రమ్య, డి.అంజయ్య, గ్రంథపాలకులు డాక్టర్ ఎ.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మాస్టర్ ప్లాన్ ఎప్పటికో..!

- నీలగిరిలో 40 ఏళ్ల కిందటి ప్రణాళికే కొనసాగింపు
- ఆదాయం కోల్పోతున్న మున్సిపాలిటీ
- 14 ఏళ్లుగా సాగుతున్న మాస్టర్‌ప్లాన్ తయారీ ప్రక్రియ

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీకి కొత్త మాస్టర్ ప్లాన్ కోసం చేస్తున్న కసరత్తు ఏళ్లు గడుస్తున్నా కొలిక్కి రావడంలేదు. పాలకవర్గాలు, ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నారు తప్పితే మాస్టర్ ప్లాన్ మాత్రం ఎక్కడి వేసిన గొంగడి అక్కడే ఉంటుంది. మున్సిపల్ యంత్రాంగం తయారు చేసిన మాస్టర్‌ప్లాన్ అమలు చేసే చివరి సమయంలో ప్రభుత్వాలు ఇస్తున్న అంతర్గత ఆదేశాలతో మాస్టర్ ప్లాన్ ముందుకు పోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. మున్సిపాలిటీలో అనేక గ్రామాలు విలీనం అయినప్పటికీ.. ఇప్పటికీ 40 ఏళ్ల కిందటి మాస్టర్ ప్లాన్ అమల్లో ఉంది. పాత మాస్టర్ ప్లాన్ వల్ల మున్సిపాలిటీ ఆదాయాన్ని భారీగా కోల్పోతోంది.

14 ఏళ్లుగా సా..గుతున్న మాస్టర్ ప్లాన్
నీలగిరి మున్సిపాలిటీకి కొత్త మాస్టర్ ప్లాన్ తయారు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించడం ప్రారంభించి 14 సంవత్సరాలు అవుతుంది. మొదట్లో మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు ప్రారంభించిన ఓ మహిళా అధికారి లక్షల రూపాయలు ఖర్చు చేశారు. కానీ, ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మాస్టర్ ప్లాన్ పూర్తి కావస్తుందని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చెప్పిన సదరు అధికారిణి కొంత కాలానికి బదిలీ అయ్యారు. ఆమె మాస్టర్ ప్లాన్ మాత్రం పది శాతం కూడా పూర్తి చేయకుండా డబ్బులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత 2017లో మరోసారి తెరపైకి వచ్చినా అమలుకు నోచుకోలేదు. 2022లో రాష్ట్ర వ్యాప్తంగా పలు మున్సిపాలిటీల్లో కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దాంతో మున్సిపల్ అధికారులు పలుసార్లు వివిధ శాఖల అధికారులతో చర్చలు జరిపి ప్రణాళికలు తయారు చేశారు. దాదాపు 90 శాతం వరకు మాస్టర్ ప్లాన్ పూర్తి అయినట్లు అప్పట్లో ప్రకటించారు. కానీ మారిన పరిస్థితుల కారణంగా అప్పటి ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు చెప్పినట్లు అధికారులు చేశారనే చర్చ ఉంది. దీంతో గతేడాది తయారు చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఆమోదిస్తారా.. లేక సమూలంగా మార్పులు చేస్తారా అనేది వేచి చూడాల్సిందే. కొత్త మాస్టర్ ప్లాన్ అమల్లోకి వచ్చే వరకు నూతన మున్సిపల్ చట్టం ప్రకారం రావాలిన్సన ఆదాయం మాత్రం కోల్పోవాల్సిందే. కొత్త ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇస్తేనే ముందుకు పోయే అవకాశం ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.



పలు కారణాలతో వాయిదా
వివిధ కారణాల వల్ల నీలగిరి మాస్టర్ ప్లాన్ ముందుకు సాగడం లేదనే చర్చ లేకపోలేదు. ఎప్పటికప్పుడు అధికారులు మారడం ఒక కారణమైతే, రాజకీయ కారణం మరోటి అని చెప్పవచ్చు. గత ఏడాది ద్వితీయార్థంలో నీలగిరి మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ కొలిక్కి వచ్చినప్పటికీ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మాస్టర్ ప్లాన్‌లు నిలిపివేయాలని మున్సిపల్ అధికారులకు గత ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు అందాయి. గ్రీన్ బెల్ట్ విషయంలో కామారెడ్డి మున్సిపాలిటీలో పెద్ద రగడ జరగడంతో అన్ని మున్సిపాలిటీల మాస్టర్ ప్లాన్‌లపై ఎఫెక్ట్ పడింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కొత్తగా ప్రభుత్వం రావడంతో మాస్టర్ ప్లాన్‌పై మళ్లీ చర్చ మొదలైంది. కొత్త ప్రభుత్వంలోనైనా నీలగిరి మున్సిపాలిటీకి కొత్త మాస్టర్ ప్లాన్ వస్తుందా లేదా అనే చర్చ సాగుతోంది.

క్లుప్తంగా

పాముకాటుతో పదో తరగతి విద్యార్థి మృతి


ఉమేష్ (ఫైల్)

మోత్కూరు: మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో పాముకాటుతో పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ముక్కెర్ల కుమార్, మమత దంపతుల కుమారుడు ఉమేష్(15) మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లో నిద్రిస్తుండగా కట్ల పాము కాటు వేసింది. తనను ఏదో కరిచిందని ఉమేష్ తన తల్లిదండ్రులకు చెప్పాడు. వారు లేచి చూడగా ఏమీ కనిపించలేదు. ఇల్లంతా వెతకగా గ్యాస్ సిలిండర్ కింద కట్ల పాము కనిపించింది. దానిని కొట్టి చంపారు. ఇంతలోనే ఉమేష్ తనకు ఏదోలా అనిపిస్తుందని వాంతులు చేసుకున్నాడు. భయాందోళనకు గురైన తల్లిదండ్రులు చుట్టుపక్కల వారిని లేపి ఉమేష్‌ను బుధవారం తెల్లవారుజామున చికిత్స కోసం ఆటోలో భువనగిరి జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఉమేష్ దత్తప్పగూడెం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతూ ప్రస్తుతం పరీక్షలు రాస్తున్నాడు. కుమార్, మమత దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు కాగా ఉమేష్ పెద్దవాడు.

లైంగిక దాడికి పాల్పడిన నిందితుడి రిమాండ్

చౌటుప్పల్: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మహారాజ్‌గంజ్ జిల్లా ఆనంద్‌నగర్ పట్టణానికి చెందిన శివ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులోని ఓ రసాయన పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆనంద్‌నగర్ పట్టణానికే చెందిన మరికొందరితో కలిసి కంపెనీ ఇచ్చిన గదిలోనే ఉంటున్నాడు. అదే గదిలో కొందరు కుటుంబ సభ్యులతో కలిసి కూడా ఉంటున్నారు. ఈ నెల 25వ తేదీ రాత్రి ఈ గదిలో తల్లి పక్కన నిద్రిస్తున్న రెండున్నరేళ్ల చిన్నారిని శివ బయటకు ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లారు. ఆ సమయంలో శివ కంపెనీ పరిసర ప్రాంతాలలో తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. స్థానిక కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ నిమిత్తం నల్లగొండ జైలుకు తరలించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య


పట్టూరి శివ (ఫైల్)

ఆత్మకూరు(ఎం): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండలంలోని పారుపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పారుపల్లి గ్రామానికి చెందిన పట్టూరి కోటమ్మ, శేఖర్ దంపతులకు ఇద్దరు కుమారులు మణికంఠ, శివ(26) సంతానం. మూడేళ్ల క్రితం శేఖర్ మృతిచెందగా.. తమ ఇంటి ముందు కిరాణ దుకాణం నడుపుకుంటూ కోటమ్మ, ఇద్దరు కుమారులు జీవనం సాగిస్తున్నారు. బుధవారం కోటమ్మ ఇంటి ముందు కిరాణ దుకాణంలో ఉండగా శివ ఇంట్లో కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగాడు. దీంతో అక్కడే కింద పడిపోగా తల్లి గమనించి చుట్టుపక్కల వారి సహాయంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. కాగా చదువు పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటున్న శివ జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.

బైక్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న మధు


నుజ్జునుజ్జయిన బైక్


పోలేపల్లి గోపి (ఫైల్)

పెద్దవూర: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం పెద్దవూర మండల కేంద్రం సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(నాగార్జునసాగర్) మండలం బోయగూడెం గ్రామానికి చెందిన పోలేపల్లి గోపి(28), కటికల మధు కలిసి ద్విచక్ర వాహనంపై శుభకార్యానికి హాజరయ్యేందుకు పెద్దఅడిశర్లపల్లి మండలం రోళ్లకల్ గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పెద్దవూర మండల కేంద్రం దాటాక జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్లు మూలమలుపు సమీపంలోకి రాగానే హైదరాబాద్ వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న పోలేపల్లి గోపికి, వెనక కూర్చున్న మధుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించగా పోలేపల్లి గోపి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మధు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా మృతుడు గోపి కులాంతర ప్రేమ వివాహం చేసుకుని ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. వీరబాబు తెలిపారు.

ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యం

● కౌలు రైతు ఆవేదన


ఎండిపోయిన వరి పంటను చూపిస్తున్న గుర్వయ్య

మునగాల(కోదాడ): యాసంగిలో 13ఎకరాల్లో సాగుచేసిన వరి పంట పూర్తిగా ఎండిపోయిందని, ప్రభుత్వం ఆదుకోకుంటే తనకు ఆత్మహత్యే శరణ్యమని మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన కౌలు రైతు చల్లా గుర్వయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం కౌలు పొలం వద్ద ఆయన తన గోడును వెలిబుచ్చాడు. వానాకాలం 13ఎకరాలు కౌలు తీసుకొని సాగుచేయగా పెట్టుబడి పోను కూలీల ఖర్చులు మిగిలాయని, అదే ఆశతో యాసంగిలో కూడా సాగుచేశానన్నారు. సాగర్ ఎడమ కాలువకు సాగునీరు విడుదల చేయకపోయినప్పటికీ 13ఎకరాలలో ఉన్న మూడు బావుల కింద వరి పంట సాగు చేశానన్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, సాగర్ నుంచి నీరు రాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి బావులు పూర్తిగా ఎండిపోయాయన్నారు. నెల రోజుల క్రితం వరకు సాగునీరు అంతంతమాత్రంగానే అందడంతో సుమారు రూ.4లక్షల వరకు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టానన్నారు. 13ఎకరాలు పూర్తిగా ఎండిపోయి కనీసం పెట్టిన పెట్టుబడి రాకపోగా అప్పులు మాత్రం మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయ అధికారులచే సర్వే చేయించి తనకు నష్టపరిహారం ఇప్పించాలని లేదంటే ఆత్మహత్యే శరణ్యమని వాపోయాడు.

లాఠీలు ఝుళిపించిన పోలీసులు

● తీవ్రరూపం దాల్చిన చిన్నపాటి గొడవ
● ఇరువురిపై కేసు నమోదు

చౌటుప్పల్: చిన్నపాటి గొడవ మాటామాట పెరగడంతో పెద్ద ఘర్షణకు దారితీసింది. దీంతో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉండడంతో పోలీసులు లాఠీలు ఝుళిపించారు. ఈ ఘటన మంగళవారం రాత్రి చౌటుప్పల పట్టణ కేంద్రంలో జరిగింది. వివరాలు.. హైదరాబాద్‌లోని నాచారం ప్రాంతానికి చెందిన జంగ ప్రియాంకరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం నుంచి కారులో హైదరాబాద్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి చౌరస్తా వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై తమ కారును అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడని కారులోని వ్యక్తులు ద్విచక్ర వాహనదారుడిని ఆపారు. కారులోని వ్యక్తులకు, ద్విచక్ర వాహనదారుడికి మధ్య మాటామాట పెరిగింది. ప్రమాదానికి కారణం మీరంటే, మీరంటూ వాదులాడుకున్నారు. మాటామాటా పెరగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆ సమయంలో ద్విచక్ర వాహనదారుడు గడ్డం సతీష్‌కు మద్దతుగా స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. కారులోని వ్యక్తులు తన మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారని ఆరోపిస్తూ సతీష్‌తో పాటు ఆయన మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉండడంతో సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మయ్య కలిసి లాఠీలు ఝుళిపించి గుంపును చెదరగొట్టారు. తమ పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు దుర్భాషలాడారని ప్రియాంకరెడ్డి ఫిర్యాదు చేయగా.. కారులోని వ్యక్తులు తన మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారని సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువురి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల చెరువులో పడి యువకుడు మృతి


కర్రె నవీన్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: చేపల చెరువులో పడి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపురం గ్రామానికి చెందిన కర్రె నవీన్ (27) వ్యవసాయం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన బావి వద్ద మేకలు మేపుతుండగా, అందులో ఒక మేక చేపల చెరువు వద్దకు వెళ్లింది. దీంతో మేకను తీసుకురావడానికి వెళ్లిన నవీన్ చేపల చెరువులో కాలు జారి పడిపోయాడు. స్థానికులు చుట్టుపక్కల వెతికినా అతడి ఆచూకీ కనిపించలేదు. చెరువులో పడి ఉంటాడని గ్రహించి, జేసీబీ సహాయంతో చేపల చెరువుకు గండి పెట్టి నీళ్లను బయటకు వదలగా.. నవీన్ మృతదేహం బయటపడింది. మృతుడికి భార్య కూడా ఉంది. నవీన్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు నర్సింహులు, పారిజాత కన్నీరుమున్నీరయ్యారు.

హైటెక్ వ్యభిచారం గుట్టురట్టు

● పోలీసుల అదుపులో ఓ విటుడు, 10మంది మహిళలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న హైటెక్ వ్యభిచారాన్ని పోలీసులు గుట్టురట్టు చేశారు. ఈజీ మనీ కోసం అలవాటు పడిన ఇతర ప్రాంతాల యువతులు, మహిళలను ఈ రొంపిలోకి లాగుతున్నట్లు సమాచారం. వారితో విటులను ఆకర్షించేందుకు వాట్సాప్, పలు సోషల్ మీడియాలలో వలపు వల వేస్తున్నట్లు తెలిసింది. మిర్యాలగూడ పట్టణ శివారు కాలనీల్లోని ఇళ్లను అద్దెకు తీసుకుని 20 నుంచి 35 ఏళ్ల లోపు యువతులతో వ్యభిచారం సాగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో వన్‌టౌన్ పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. కాలనీలోని మూడు ఇళ్లలో దాడులు చేసి 10మంది మహిళలతో పాటు ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. వారందరిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. కాగా ఈ వ్యవహారం ఎప్పటినుంచి సాగుతుంది? దీని వెనుక ఉన్న ఎవరు ఉన్నారు? పట్టుబడిన యువతులు ఏ ప్రాంతానికి చెందినవారు? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. విచారణ పూర్తయిన పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

ఏసీబీ వలలో పంచాయతీ సెక్రటరీ

● రూ.3వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు


పంచాయతీ కార్యదర్శి చిన్నం కిరణ్

మోత్కూరు: మండలంలోని పాడిచేడు గ్రామ పంచాయతీ కార్యదర్శి చిన్నం కిరణ్ బుధవారం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వివరాలు... పాడిచేడు గ్రామానికి చెందిన గొరిగె మహేష్ ప్రాపర్టీ వ్యాల్యుయేషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా.. పంచాయతీ కార్యదర్శి కిరణ్ రూ.5 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఎంత బతిమిలాడినా పంచాయతీ కార్యదర్శి సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో మహేష్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. కాగా బుధవారం మోత్కూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహేష్ నుంచి కిరణ్ రూ.3వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఉమ్మడి జిల్లా ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట పంచాయతీ కార్యదర్శిని హాజరుపరుస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సీఐలు వెంకట్‌రావు, రామారావు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మేళ్లచెరువు: మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమ కాలనీ వద్ద బుధవారం గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు. బిహార్ రాష్ట్రానికి చెందిన గోల్డెన్ కుమార్ వద్ద 200 గ్రాముల గంజాయి ప్యాకెట్ లభించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. గోల్డెన్ కుమార్ గత రెండు నెలల నుంచి మైహోం సిమెంట్ పరిశ్రమలో కూలీగా పనిచేస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్లు పేర్కొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి


సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న చిల్లేపల్లి సహకార సంఘం చైర్మన్, డైరెక్టర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి సహకార సంఘంలో ధాన్యం కొనుగోళ్లకు సంబధించి రూ.2కోట్లకు పైగా అక్రమాలకు పాల్పడిన మాజీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని ప్రస్తుత చైర్మన్ మలిగిరెడ్డి రమణారెడ్డి, డైరెక్టర్లు మలిగిరెడ్డి హేమలత, పెరువాల రంగారెడ్డి, పల్లా వెంకన్న, ముత్తమ్మ, గోవిందు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2020–21 సంవత్సరానికి గాను ఐకేపీల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చిల్లేపల్లి సహకార సంఘం పరిధిలో చేపట్టాల్సి ఉండగా నాటి సంఘం చైర్మన్, సీఈఓ, మిల్లు యజమానులు కుమ్మక్కై వేరే ప్రాంత రైతుల పేర్ల ట్రక్ సీట్లు, బిల్లులు తయారుచేసి ఎలాంటి ధాన్యం కొనుగోళ్లు జరపకుండానే రూ.2కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. వ్యవసాయశాఖ అధికారులు చెప్పిన ప్రకారం చిల్లేపల్లి ప్రాంతంలో రైతులు సన్న రకం ధాన్యం పండించారని, అయితే సంఘం మాజీ చైర్మన్ మాత్రం దొడ్డు రకం ధాన్యం కొన్నట్లు రికార్డుల్లో చూపించారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు, సహకార శాఖ అధికారులకు వినతిపత్రం ఇచ్చినప్పటికీ బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా చిల్లేపల్లి సహకార సంఘం మాజీ చైర్మన్, సీఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణం

పాలకవీడు: ఉరేసుకుని సిమెంట్ పరిశ్రమలో పనిచేసే కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పాలకవీడు మండలం మహంకాళిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ పరిసరాల్లో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రంలోని తెహార్ జిల్లాకు చెందిన సితాన్ భూయాన్(23) ఓ ఏజెన్సీ ద్వారా స్థానిక డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే పనులకు వెళ్లి వచ్చిన సితాన్ భూయాన్ మంగళవారం సాయంత్రం బయటకు వెళ్లివస్తానని తన సోదరుడు, బావమరిదికి చెప్పి వెళ్లాడు. ఎంతసేపటికీ తిరిగి రాలేదు. బుధవారం ఉదయం డెక్కన్ సిమెంట్ పరిశ్రమ పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో భూయాన్ చెట్టుకు ఉరేసుకున్నట్లు వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి వివరాలు సేకరించారు. సితాన్ భూయాన్‌కు ఇటీవల వివాహం కుదిరిందని, ఆ పెళ్లి ఇష్టం లేకే బలవన్మరణానికి పాల్పడిండవచ్చని అతడి సోదరుడు తెలిపాడని పోలీసులు పేర్కొన్నారు. మృతుడి సోదరుడు రాజ్‌దీప్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చౌటుప్పల్‌లో యువకుడు..

చౌటుప్పల్: ఉరేసుకొని యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని హనుమాన్‌నగర్ కాలనీలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటకు చెందిన కొరిపల్లి సంజయ్(26) చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో గల దివీస్ పరిశ్రమలో కొంతకాలంగా పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో పనిచేసే ఇద్దరు యువకులు హనుమాన్‌నగర్‌లోని ఓ ఇంటి పెంట్‌హౌజ్‌లో అద్దెకు ఉంటున్నారు. కంపెనీ హాస్టల్‌లోనే ఉండే సంజయ్ ఇటీవల తన స్నేహితులు ఉంటున్న గదిలోకి వచ్చాడు. ఈ క్రమంలో బుధవారం పెంట్‌హౌజ్‌లో ఉండే యువకుల్లో ఒకరు ఊరెళ్లగా, మరో యువకుడు గిరీష్ డ్యూటీకి వెళ్లాడు. సంజయ్ డ్యూటీకి వెళ్లకుండా అక్కడే ఉన్నాడు. సాయంత్రం డ్యూటీ ముగిసిన తర్వాత గిరీష్ ఇంటికి వచ్చి చూసేసరికి సంజయ్ ఫ్యాన్‌కు ఉరికి వేలాడుతుండడం గమనించి ఇంటి యజమానికి విషయం చెప్పాడు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ యాదగిరి ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎలక్ట్రికల్ షాప్‌లో అగ్నిప్రమాదం

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని గాయత్రి ఎలక్ట్రానిక్ షాప్‌లో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. వివరాలు.. రోజుమాదిరిగా మంగళవారం రాత్రి 9గంటలకు గాయత్రి ఎలక్ట్రికల్ షాప్ యజమాని సీత శేఖర్ షాప్ మూసి వేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో షాపు నుంచి పొగలు వస్తుండటంతో స్థానికులు గమనించి పోలీసులు, షాపు యజమానికి సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని షట్టర్ పగులగొట్టి మంటలార్పారు. ఈ అగ్నిప్రమాదంలో షాపులో ఉన్న కొన్ని వస్తువులు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మోత్కూరు: మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో బుధవారం బాల్య వివాహాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు, పోలీస్ సిబ్బంది బుధవారం అడ్డుకున్నారు. వివరాలు.. కొండగడప గ్రామానికి చెందిన బాలికకు బాల్య వివాహం చేస్తున్నట్లు తెలుసుకున్న అధికారులు గ్రామానికి చేరుకొని బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహం చేయడం వలన కలిగే అనర్థాలను బాలిక కుటుంబ సభ్యులకు వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే చైల్డ్ కేర్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది కవిత, ఏఎస్ఐ వెంకన్న, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ దశరథ, నందిని, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

మోదీ పాలనకు చరమగీతం పాడాలి


మాట్లాడుతున్న ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాతపాల్

ఆలేరురూరల్: లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాతపాల్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎన్డీఏ కూటమి చిత్తుగా ఓడిపోతుందని, ఇండియా కూటమి అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో 15 ఎంపీ స్థానాలను కాంగ్రెస్ గెలవబోతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను తమకు అనుకూలంగా మార్చుకుంటుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తూ ప్రాంతీయ పార్టీలను లొంగదీసుకునే ప్రయత్నాలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని ఓట్ల రూపంలో మార్చుకోవాలని, మెజార్టీ సీట్లలో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. వంద రోజుల ప్రజాపాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి, పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి సుధాకర్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, సంధ్యారెడ్డి, నీలం పద్మ, ఎంపీపీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ రంగాల్లో శిక్షణతో ఉపాధి అవకాశాలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి బి. శ్రీధర్‌రెడ్డి

గరిడేపల్లి: యువత వ్యవసాయ అనుబంధ రంగాలైన చేపలు, పట్టు పురుగులు, పుట్టగొడుగులు, కోళ్ల పెంపకంలో శిక్షణ పొందడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి బి. శ్రీధర్‌రెడ్డి అన్నారు. గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో గత ఏడు రోజులుగా తేనేటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి సీనియర్ శాస్త్రవేత్త డి. నరేష్, కేవీకే మృత్తికా శాస్త్రవేత్త ఎ. కిరణ్, శాస్త్రవేత్తలు సుగంధి, టి. మాధురి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీల్లో నగదు పట్టివేత

పెన్‌పహాడ్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పెన్‌పహాడ్ మండలం పొట్లపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహించారు. మహబూబ్‌బాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన వ్యక్తులు బొలేరో వాహనంలో రూ.లక్ష నగదు తీసుకెళ్తుండగా.. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పెరిక రవీందర్ తెలిపారు.

చెరువు మన్ను.. చేనుకు దన్ను

● అధిక దిగుబడులకు ఆస్కారం


ఎల్. సందీప్ కుమార్, ఏఓ, పెద్దవూర


చెరువు మట్టిని పొలంలో పోసుకున్న రైతు

పాడి పంట

పెద్దవూర: గతంలో వేసవి కాలంలో చెరువుల్లోని నీరు ఎండిపోయినప్పుడు అందులోని మట్టిని తీసి పంట పొలాల్లో వేసుకునేవారు. ఇప్పుడు ఈ పద్ధతి పాటించేవారు తక్కువయ్యారు. కానీ దీని వలన రెండు రకాల ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయ అధికారి ఎల్. సందీప్‌కుమార్ సూచిస్తున్నారు. చెరువు మట్టిని పొలాల్లో పోసుకోవడం వలన కలిగే లాభాలు ఆయన మాటల్లోనే.. వర్షాలు పడ్డప్పుడు సారవంతమైన మట్టి మొత్తం వచ్చి చెరువులోకి చేరుతుంది. వేసవిలో నీళ్ల తక్కువగా ఉండటం వలన ఈ మట్టిని పూడిక తీయడం వలన మళ్లీ వచ్చే ఏడాది చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ఇక చెరువు నుంచి తీసిన మట్టిని పంట పొలాల్లో వేయడం ద్వారా ఆ పొలాలు సారవంతం అవుతాయి. చెరువు మట్టి లోతును బట్టి అందులోని పోషకాలు ఆధారపడి ఉంటాయి. అయితే ఇందులో ఆమ్ల, క్షార తత్వాలతో పాటు పురుగు మందుల అవశేషాలు కూడా ఉండే అవకాశం ఉంటుంది. చెరువు మట్టి తరలించే ముందు పూడిక స్థాయి, లోతు, విస్తీర్ణం గమనించాలి. చెరువు మట్టిలోని పోషకాల స్థాయిని గుర్తించేందుకు మట్టి పరీక్షలు చేయించాలి. ఇలా కనీసం రెండు మూడేళ్లకోసారి పొలంలో మట్టిని నింపుకోవడం ద్వారా వర్షాల వల్ల నీటి కోతకు గురైన భూములకు చికిత్స జరుగుతుంది. చెరువు మట్టితో పాటు పచ్చిరొట్ట పెంచడం, పశువుల పెంట ఉపయోగించటం వంటివి చేయడం వలన భూమి గుల్లబారుతుంది. నేలకు సరైన మోతాదులో పోషకాలు పెరుగుతాయి.

సాగుకు అనుకూలం..

గ్రామాల్లో వర్షాధార చెరువులు ప్రస్తుతం అడుగంటిపోతున్నాయి. ఎండిన చెరువుల్లోని 2 నుంచి 3 అడుగుల మేర పేరుకుపోయిన మట్టిని పంట భూముల్లో వేసుకోవాలి. తర్వాత ఎంబీ నాగలితో పాటు రోటోవేటర్‌తో కలియదున్నితే భూమిలో అప్పటికే ఉన్న మట్టితో ఇది కలిసిపోయి పంట సాగుకు అనుకూలంగా మారుతుంది. వర్షాలు బాగా కురిసినప్పుడు ఎత్తైన ప్రదేశాల నుంచి వర్షపు నీటితో పాటు ఇసుక, బంకమట్టి, ఒండ్రు మట్టి, వివిధ పొళ్లలో కుళ్లిన వ్యర్థాలతో కలిసి చెరువుల్లోకి చేరుతాయి. అందులో నీరు ఉన్నంతకాలం లోపలే కుళ్లి మంచి సేంద్రీయ కర్బనంగా మారుతుంది. సాధారణంగా చెరువు మట్టిలో 70 శాతం ఒండ్రు, 30 శాతం బంక మట్టి ఉంటుంది. పంటలకు అవసరమయ్యే నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటు సూక్ష్మపోషకాలు కూడా ఉంటాయి.

- చెరువు మట్టిని పొలాల్లో వేయడం ద్వారా పొలాన్ని ఆమ్ల, క్షార గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు.
- నేల గుల్లబారడంతో పాటు లవణాల గాఢత తగ్గుతుంది.
- సూక్ష్మ, స్థూల పోషకాల స్థాయితో పాటు ముఖ్యంగా నత్రజని స్థాయి పెరుగుతుంది.
- చెరువు మట్టితో పాటు సేంద్రియ ఎరువులను కూడా కలిపి పొలంలో వేసుకోవడం ద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు.
- చెరువు మట్టిలో సూక్ష్మజీవులు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇవి నేలలో పోషకాలను పెంచుతాయి.
- కరువు, వర్షాభావ పరిస్థితులను సైతం ఎదుర్కొనే శక్తిని నేలకు అందిస్తుంది.
- మొక్కలు ఆరోగ్యంగా, ఎత్తుగా పెరుగుతాయి.
- పంట దిగుబడి పెరుగుతుంది.